క్లుప్తంగా

ఏలేరుకు గోదావరి జలాలు



ఏలేరు ప్రాజెక్టులోకి విడుదల చేస్తున్న గోదావరి జలాలు

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టులోని పురుషోత్తపట్నం నుంచి పైపుల ద్వారా గోదావరి జలాలు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోని బుధవారం 750 క్యూసెక్కుల గోదావరి జలాలు వదిలారు. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 71.05 మీటర్లు, 24.11 టీఎంసీలకు 5.09 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో దిగువ ఆయకట్టుకు 200, విశాఖకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

గండేపల్లి: తాళ్లూరు జెడ్పీ స్కూల్‌లో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అధ్యక్షతన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో, బాలల హక్కులు, అక్రమ రవాణా, వేధింపులు, పీసీ పీఎన్డీటీ యాక్ట్ తదితర అంశాలపై వివరించారు. బాలికలు 18, బాలురు 21 ఏళ్ల నిండకుండా వివాహాలు చేసుకుంటే చట్టరీత్యా నేరమని, రెండేళ్ల జైలు శిక్ష గాని, లక్ష రూపాయిలు జరిమానా గాని ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

కిర్లంపూడి: మండల పరిధి రాజుపాలెం నుంచి రామచంద్రపురం గ్రామం మీదుగా వెళ్లే రోడ్డు నిర్మాణానికి తక్షణం చర్యలు చేపట్టాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. స్థానిక సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్‌తో కలిసి బుధవారం గోతులమయంగా మారిన రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ రోడ్డు ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, శాశ్వత రోడ్డు వేసే వరకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళతామని అన్నారు.

జి-పాట్ ఆల్ ఇండియాలో మానసకు 12వ ర్యాంక్



గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థి జి-పాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్) ఆల్ ఇండియా 12వ ర్యాంక్ సాధించినట్టు యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఫార్మసీకి చెందిన విద్యార్థిని గరికిన మానసకు ప్రిన్సిపాల్ కె.రవిశంకర్, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

నాణ్యమైన పంటల సాగుతో అధిక దిగుబడి



పొలంబడిలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ వీర గంగాధర్

ప్రత్తిపాడు: నాణ్యమైన పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జగ్గంపేట వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ తెలిపారు. పెదశంకర్లపూడిలో బుధవారం సాయంత్రం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంపై రైతులు అవగాహన కల్పించుకోవాలన్నారు. రైతులు వారానికి ఒకసారి పంటలను పరిశీలించడం ద్వారా సరైన నిర్ణయాలను తీసుకోవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ సహాయకుల సలహాలు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులను భాగస్వామ్యం చేసి, వారానికి ఒకసారి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని వ్యవసాయశాఖ ఏడీ యింటి వీర గంగాధర్ వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొమ్మల కత్తిరింపే కీలకం

- కోకోలో మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి
- జూలై నుంచి డిసెంబరు వరకూ అనుకూలం



తేటగుంటలో కోకో కొమ్మలు కత్తిరింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

తుని రూరల్: మానవాళికి ఆరోగ్యం ఎంత ముఖ్యమో కోకో మొక్కలకూ అంతే ముఖ్యం. చాక్లెట్ తాయారీలో ప్రధాన ముడి సరుకుగా కోకో గింజలను వినియోగిస్తారు. ఆ చాక్లెట్లను చిన్నారులు ప్రీతికరంగా తినడంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా కొమ్మలు కత్తిరింపుతో కోకో తోటల నుంచి నాణ్యమైన అధిక దిగుబడులు లభిస్తాయని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు. గాలి, వెలుతురు, సూర్య రశ్మి కాండంపై తాకితే కోకో తోటలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. కోకోలో కొమ్మలను ఐదారు అడుగుల ఎత్తులో గొడుగు ఆకృతిలో కత్తిరిస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. కొమ్మలు కత్తిరింపుతో కలిగే బహుళ ప్రయోజనాలను ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి రైతులకు సూచించారు. కోకో మొక్కలు పెరిగి పెద్దవై కాపు వచ్చినప్పటి నుంచి కత్తిరింపులు రెండు విధాలుగా చేపట్టాలన్నారు. ఆరోగ్యవంతమైన మొక్కలు పెరుగదలకు, కొమ్మలు నియంత్రణకు కత్తిరింపులు చేపట్టాలన్నారు.

ఆరోగ్యవంతమైన కత్తిరింపులు

తెగులు సోకిన, అవసరం లేని ముదర కొమ్మలు, అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించడం వలన ఆ చెట్టు ధృడంగా పెరిగి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రధాన కాండం మీద నుంచి పుట్టికొచ్చే కొమ్మలను ఎండిపోయిన కొమ్మలను, చీమల గూడులను, ఎలుకలు, ఉడతలు నష్టపర్చిన కాయలను, ఎండిపోయిన కాయలను తొలగించాలి. ఈ విధానాల వల్ల మొక్క సరైన గొడుగు ఆకారాన్ని సంతరించుకుంటుందన్నారు. పూత, కాయలు ఉన్నప్పుడు కత్తిరింపులు చేయకూడదన్నారు.

పెరుగుదల నియంత్రణకు..

వయస్సు పెరిగే కొద్ది మొక్కలు గుబురుగా ఉండే కొమ్మల నియంత్రణకు కోకోలో కొమ్మలు కత్తిరింపు చేపట్టాలన్నారు. ఐదారు అడుగుల ఎత్తులో గొడుగు ఆకృతిలో కొమ్మలు ఏర్పడేలా కత్తిరించాలన్నారు. వాతావరణం చల్లబడినప్పుడే కత్తిరింపులు చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కత్తిరింపులు చేపట్టకూడదన్నారు. కత్తిరించిన కొమ్మల చివర్లలో బోర్డో పేస్టును తప్పనిసరిగా పూయాలన్నారు.

కత్తిరింపులో జాగ్రత్తలు

కోకోలో కొమ్మలు కత్తిరింపునకు జూలై నుంచి డిసెంబరు వరకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. దిగుబడులు తగ్గే ప్రమాదం ఉన్నందున అధికంగా కొమ్మలు కత్తిరింపు చేయకూడదు. ప్రధాన కొమ్మలను ఎట్టిపరిస్థితిల్లో కత్తిరించకూడదు. కత్తిరింపుల వల్ల కొమ్మలు పగుళ్లు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించాలి. కొమ్మలు కత్తిరించిన తర్వాత ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, పెద్ద కొమ్మలకు పూత వేయాలని వ్యవసాయాధికారి తెలిపారు. ఇలా చేస్తే నాణ్యత గల అధిక దిగుబడి లభిస్తుందన్నారు.

యాజమాన్య పద్ధతులు



కోకో సాగుకు మెట్ట భూములు అనుకూలం. ఆయిల్‌పామ్, కొబ్బరిలో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. కోకో సాగుతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. అంతర పంటగా కోకో సాగు చేస్తే హెక్టారు కొబ్బరిలో 500 మొక్కలు, ఆయిల్ పామ్‌లో 400 మొక్కలు నాటు కోవచ్చు. నీటి ఎద్దడి సమయంలో నీటి పారుదలకు సూక్ష్మ సేద్యం పరికరాలు అమర్చుకోవడం మంచిది. రైతులు ఎరువులు యాజమాన్యం, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఎరువులు మోతాదుకు మించి వాడకూడదు. అంతర పంటగా కోకోను సాగు చేసే రైతులకు మూడేళ్లలో రూ.20వేలు రాయితీగా ప్రభుత్వం అందిస్తుంది.

– జి.విజయలక్ష్మి, హెచ్‌ఓ, తుని

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది బుగతా శివ

ఏలేశ్వరం: రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ న్యాయవాది బుగతా శివ అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో యర్రవరంలోని విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో బుధవారం రోడ్డుప్రమాదాల నివారణపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శివ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండడంతో పాటు హెల్మెట్ ఉపయోగించాలన్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై జిసతీష్, న్యాయవాది అవసరాల దేవి, ప్రిన్సిపాల్ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడిలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేయించారు. వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయించారు.

అంగన్‌వాడీల ధర్నా



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



తునిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఏలేశ్వరం: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పట్టణంలో బుధవారం అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేశారు. కోర్కెల దినం పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. సమ్మె కాలంలో సుప్రీంకోర్టు తీర్పుప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వోగ్యులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అమలావతి, నాగలక్ష్మీ, నూకరత్నం, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలందరూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీఓ 47 ను మార్పు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై మినిట్స్ కాపీలో ఒప్పందం ప్రకారం ఇవ్వాలని కోరారు. వాటితోపాటు మినీసెంటర్లను మెయిన్ సెంటర్లగా అప్‌గ్రేడ్ చేయాలని, డెత్ బెనిఫిట్స్, సంక్షేమపథకాలు వర్తింపు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మరికొన్ని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే త్వరలో తమ పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు లీడర్ బి.మేరీ సమాధానం, సెక్టార్‌లీడర్స్ ఎస్.సుజాత, బి.సుబ్బలక్ష్మి, ఎం.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి : డిమాండ్‌లను నెరవేర్చాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ ఆశయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రత్నం, టి.జీవా, ఈశ్వరీ, బి.రమణమ్మ, సుధారత్నం,పి.సావిత్రి, భవన నిర్మాణ కార్మికులు, మిడ్ డే మీల్ సిబ్బంది ఉన్నారు.

తుని: ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. వరల్డ్ డిమాండ్స్ డే సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రింకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలో అంగీకరించిన అంశాలపై జీఓ ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రీస్కూలు బలోపేతం చేయాలని ఐదు సంవత్సరాల లోపు పిల్లల్ని కాన్వెంటులకు వెళ్లకుండా జీవో ఇవ్వాలని, అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వై.ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఉమా మహేశ్వరి, ఇందిరా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస సాగుపై దృష్టి సారించాలి

పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్



ప్రత్తిపాడులో పశుసంవర్థక శాఖ అధికారులు ప్రదర్శించిన పశుగ్రాస రకాలు

ప్రత్తిపాడు: పశు పోషకులు మేలు రకం పశుగ్రాసాలను సాగు చేయడంతో పశువులకు పాల దిగుబడి పెరుగుతుందని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ అన్నారు. పశుగ్రాసం కోసం పాడి రైతాంగం పడుతున్న ఇక్కట్లు తొలగాలంటే కొంతమేర పశుగ్రాస సాగు చేపట్టాలని ఆయన అన్నారు. పశుగ్రామ వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడులోని అభ్యుదయ పాడి రైతు కర్రి రామకృష్ణారెడ్డి పశుగ్రాస క్షేత్రంలో పశుసంవర్ధక శాఖ బుధవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ నేపీయర్ బహు వార్షిక పశుగ్రాసం రకాన్ని నీటి వసతి ఉన్న రైతులు నాటుకోవచ్చని చెప్పారు. దీనివల్ల హెక్టార్‌కు 80 నుంచి 100 టన్నుల పశుగ్రాసం లభిస్తుందని చెప్పారు. అలాగే గడ్డి కత్తిరించే మిషన్ వాడడం వల్ల 10 నుంచి 20 శాతం గడ్డి వృథా కాకుండా ఉంటుందన్నారు. కణుపుల గడ్డిని 3 నుంచి 4 అంగుళాల సైజులో కత్తిరించడం వల్ల రుచిగా ఉండి ఆహారాన్ని పశువులు బాగా తీసుకుంటాయని, దీనివల్ల ఐదు నుంచి పది శాతం పాల దిగుబడి పెరుగుతుందని వివరించారు. పశుగ్రాసాల సాగు, వాటి పెంపకంలో మెళకువలు, పశుగ్రాస సాగు వల్ల ఒనగూరే ప్రయోజనాలు, ఆవశ్యకతలు, పశుగ్రాసాల మేపు వల్ల పాడి పశువులకు జరిగే మేలు తదితర అంశాలను ఏడీ డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ వివరించారు. ఈసదస్సులో ప్రభుత్వ పశు వైద్యశాలల వైద్యాధికారులు సుంకర వరలక్ష్మి, సతీష్, మంజూష లతో పాటు పశువైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు. ఈ సదస్సులో గడ్డిసాగులో వివిధ రకాలైన జనుము, సజ్జలు, పారా గడ్డి, సుబాబుల్, జాన్సన్ గడ్డి, కణుపు గడ్డి, పిల్లి పెసర, గరిక గడ్డి, జపాన్ నేపీయర్ గడ్డి, ఎడ్డి లూసర్న్, మొక్కజొన్న, సూపర్ నేపీయర్ తదితర గడ్డి రకాలను ప్రదర్శించారు.

డయేరియా నిర్మూలన అందరి బాధ్యత



కోటనందూరులో పంచాయతీ కార్యదర్శులకు క్లోరోస్కోపులను అందిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

కోటనందూరు: డయేరియా నివారణకు అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ జయమాధవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శిలను స్టాప్ డయేరియా, ఇంటిపన్నులు, నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాధవి మాట్లాడుతూ కుళాయిలకు సరఫరా చేసే తాగునీటిని రెండు పూటలా క్లోరినేషన్ చేయాలని, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పైపులైన్ రిపేర్లు చేయడం ద్వారా తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచూ ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ, ఫాగింగ్ చేయించాలని చెప్పారు. ఒంటరి మహిళలకు పింఛను పథకంలో అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలన్నారు. అనంతరం 17 పంచాయతీలకు వచ్చిన నీటి పరీక్ష యంత్రాలు క్లోరోస్కోపులను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కట్నం వేధింపుల ఫిర్యాదుపై కేసు

జగ్గంపేట: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట ఏఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజపూడి గ్రామానికి చెందిన శైలజకు పెద్దాపురం గ్రామానికి చెందిన పురందాసు రామకృష్ణతో 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెళ్లి సమయంలో ఇవ్వాల్సిన అన్ని కానుకలు అత్తంటివారికి అందచేశారని, అయినా అదనంగా కట్నం కావాలంటూ భర్త రామకృష్ణ, అత్త, మామ, ఆడపడుచులు వేధించడంతో శైలజ కొద్ది రోజుల క్రితం పుట్టింటికి రాజపూడి వచ్చేసింది. అయినా వేధిస్తుండడంతో బుధవారం జగ్గంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఏఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు.

ఐటీఐ కళాశాలకు భవనాలు నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే జ్యోతులకు వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

జగ్గంపేట: గ్రామంలో ఐటీఐ కళాశాలకు భవనాలు నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గతంలో ఐటీఐ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారని, కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం జగ్గంపేట జూనియర్ కాలేజీ ఐటీఐ క్లాసులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్, విద్యార్థి సంఘం నేతలు తెలిపారు. అలాగే ఎస్సీ, బీసీ హాస్టళ్లకు కూడా కొత్త భవనాలు నిర్మించాలని కోరారు.ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం నిర్మించి 35 సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకు చేరుకుందని, బీసీ సంక్షేమ వసతి గృహం 12 ఏళ్లు అద్దె భవనంలో కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్‌యూ జిల్లా కో కన్వీనర్ శ్రీకాంత్, విద్యార్థి సంఘం నేతలు పండు, గంగాధర్, సతీష్, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీ

జగ్గంపేట: రామవరం గ్రామానికి చెందిన లింగంశెట్టి లక్ష్మీనారాయణకు చెందిన పల్సర్ మోటారుసైకిల్ చోరీకి గురైంది. జగ్గంపేట ఏఎస్సై ముజుబుద్దీన్ కథనం ప్రకారం..లక్ష్మీనారాయణ రామవరం శివారులో తన పొలం వద్ద రోడ్డుపై గత నెల 29వ తేదని మోటారుసైకిల్ పార్కు చేసి పొలంలోకి వెళ్లాడు. కొద్దిసేపటికి వచ్చి చూడగా మోటారుసైకిల్ కనిపించ లేదు. దీనితో అప్పటి నుంచి పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏసు

జగ్గంపేట: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మరుకుర్తి ఏసు ఎంపికయ్యారు. జగ్గంపేటలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మరుకుర్తి ఏసు, ఉపాధ్యక్షుడిగా కె.అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.మోహన్, సహాయ కార్యదర్శిగా రాఘవులు, కోశాధికారిగా టి.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మరో 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఆమోదించిందని నూతన అధ్యక్షుడు ఏసు తెలిపారు.

నిబంధనలతోనే ప్రమాదాల నివారణ

సీఐ లక్ష్మణరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

గండేపల్లి: రోడ్డు నిబంధనలు పాటించడం తోనే ప్రమాదాలను నివారించవచ్చని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్ లైన్ సేఫ్టీపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రుద్దు ప్రయాణంలో హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, సెల్ ఫోన్లో మాట్లాడులూ డ్రైవ్ చేయడంపై వచ్చే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదంతోపాటు శిక్షార్హనేరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ బి.సూర్యనారాయణ మూర్తి, న్యాయవాదులు ఎ.ప్రభుజీ, ఎం.రాంబాబు, సత్యవతి, సోషల్ వర్కర్ ఎస్.అప్పలకొండ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైందవ చైతన్యం తీసుకురావడమే లక్ష్యం

గోకవరం : మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే ప్రథమ లక్ష్యంగా కృషి చేస్తున్నామని విశ్వ హిందూ ధర్మం పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దేవిచౌక్ కనక దుర్గమ్మ ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంగారు వరలక్ష్మి కానుక రిజిస్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 14 వరకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 11న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 90 మంది మహిళలకు ఒక గ్రాము బంగారు వరలక్ష్మి డాలర్ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు.

మహిళ సాధికారితే లక్ష్యం

జగ్గంపేట: మహిళలకు సాధికారిత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సీఎంఎంవీవై పథకాన్ని అమలు చేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. కాట్రావులపల్లి పీహెచ్‌సీలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. మిషన్ శక్తిలో భాగంగా ప్రధాన మంత్రి మాతృత్వ యోజన (సీఎంఎంవీవై) పథకం లక్ష్యాన్ని వివరించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఏలేశ్వరంలో భవితకేంద్రంలో పిల్లలను అభినందిస్తున్న అధికారులు



ధర్మవరంలో భవిత కేంద్రంలో దివ్యాంగ బాలల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకుడు వై.నరసింహం, జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం వారు పరిశీలించారు. భవిత పిల్లలు కంప్యూటర్ టైపు చేయడం, రంగుల బోధనోపకరణాలతో విద్యను నేర్పించడం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు కేంద్రంలో ఉన్న పరికరాలతో విద్యను నేర్పించాలన్నారు. పిల్లల తల్లిదండ్రులు కేంద్రంలోనే టైలరింగ్ చేయడం అభినందనీయమన్నారు. పిల్లలు ట్యాబ్‌ల ద్వారా విద్య నేర్చుకోవడం సంతోషమన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వరలక్ష్మి, సిబ్బంది వాణిపద్మజ, బుజ్జి, రమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలల అభివృద్ధికి చర్యలు

ప్రత్తిపాడు రూరల్: జిల్లాలో దివ్యాంగ బాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ వై.నరసింహారావు, జిల్లా కన్సల్టెంట్ చామంతి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని భవిత కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, బోధన విధానాలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని శిక్షణ పొందుతున్న స్వల్ప, అతి స్వల్ప దివ్యాంగ బాలలను సాధారణ విద్యార్థులతో మమేకమయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. మే, జూన్‌లలో నిర్వహించిన సర్వేల ప్రకారం దివ్యాంగ బాలలందరూ పాఠశాల్లో నమోదు కావాలని సూచించారు. ధర్మవరం భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్టును నియమిస్తామని వారు తెలిపారు. భవిత కేంద్రాల్లో ఉన్న సమస్యలను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వి.రాజబాబు, ఎంఈఓ-2 వై అచ్చిరాజు, సీఆర్పీ రాంజీ, జెడ్పీ స్కూల్, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వివిధ కార్మిక సంఘాల కార్యకర్తలు



కోటనందూరు బస్టాండు సెంటర్లో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రత్తిపాడు: కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడులో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టం ప్రకారం పీఎఫ్ ఆలస్యమైతే 25 శాతం వరకు జరిమానా విధించి, ఆ సొమ్మును కార్మికుల ఖాతాలకు జమ చేసేవారని చెప్పారు. మోదీ అధికారం చేపట్టాక ఈ జరిమానా 5 శాతానికి తగ్గించేశారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలని, ఉపాధి హామీ పథకంలో రూ.600 రోజువారీ వేతనం చెల్లించాలని రొంగల ఈశ్వరరావు కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎస్.నరసింహారావుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, వీఆర్ఏ, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సంఘ నాయకులు శీరం సత్తిబాబు, అల్లాడి లక్ష్మి, ఎస్ హేమలత, మరియ, పార్వతి, సీహెచ్ వెంకటలక్ష్మి, మంగ లక్ష్మి, కొమరగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల ప్రతినిధులు డిమాండు చేశారు. జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం వివిధ సంఘాల ప్రతినిధులు స్థానిక బస్టాండు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. బస్టాండు సెంటర్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వివిధ పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికుల గుర్తించి వారికి కనీసం వేతనం చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని డిమాండు చేశారు ఈ కార్యక్రమంలో సీఐటియూ ప్రతినిదులు షేక్ పద్మ, అంకంరెడ్డి రమణమ్మ, మరియా రత్నం తదితరులు పాల్గొన్నారు.